మీకు అనేకంగా కనిపిస్తూ ఉంటే అది మాయ. మట్టితోటి కుండలు రకరకాలుగా చేయవచ్చు, ఆ నామరూపాలు మాయ కాని మట్టి నిజం. ఎందుచేతనంటే ఆ నామరూపాలు పోయినా మట్టి ఉంటుంది. కుండ కూడా నిజమే, కుండ కుండగా నిజం కాదు మట్టిగా నిజం. అలాగే ఈ లోకం లోకంగా నిజంకాదు, బ్రహ్మంగా నిజం. కుండలలో వివిధ రకాల నామ రూపాలలో ఉన్నది కూడా మట్టే. మనం ఆ నామరూపాలను చూస్తున్నాము గాని ఆ నామ రూపములకు ఆధారంగా ఉన్న మట్టిని చూడలేకపోతున్నాము, ఆ మట్టిని చూడగలిగితే నీకు వికారాలు ఆగిపోతాయి. ఆ ఆకారాల వలననే వికారాలు వస్తున్నాయి కాని ఆకారాలు పోతే ఇంక వికారాలు లేవు. మనం ఎవరినైనా ఒక వస్తువు అడిగి పుచ్చుకోవటం వేరు, వారికి ఇవ్వాలి అని ఇవ్వటం వేరు. ఇవ్వాలని ఇచ్చినప్పడు ఉంది దాని వైభవం. నీ ఆలోచనల తోటి, నీ ప్రయత్నాల తోటి సంబంధం లేకుండా గురువు యొక్క సమక్షంలో ఆయన అనుగ్రహం వలన నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నేచురల్‌గా, నార్మల్‌గా నీకు ఎరుకలోనికి వస్తుంది, అది గురువు యొక్క వైభవం. ఏకమక్షరం హృదినిరంతరం భాసతేస్వయం. ఉన్నది ఒక్కటే వస్తువు. అది ఎప్పడూ ఉంటుంది, దానికి నాశనం లేదు, అది స్వయం ప్రకాశం. నేను మిమ్మల్ని చూడాలంటే బాహ్యమైన సూర్యుడు యొక్క కాంతిగాని, కరెంటు సహాయం గాని అవసరం, ఆ వెలుగు లేకపోతే మీరు నాకు కనబడరు, నేను మీకు కనబడను. హృదయంలో ఉన్న వస్తువుకు బయట వెలుగులు అంటే సూర్యకాంతిగాని, దీపాలకాంతిగాని ఏదీ అక్కరలేదు, అది స్వయంప్రకాశం, అది ఉండటం వలననే అది తెలియబడుతూ ఉంటుంది. అట్టి స్వయం ప్రకాశమైన వస్తువును అశాంతిగాని, దుఃఖంగాని, చావుపుట్టుకలు గాని ఏమీ ముట్టుకోవు. అది స్వతంత్రమైనది. అట్టి శక్తి స్వరూపమైన, జ్ఞాన స్వరూపమైన, ఆనంద స్వరూపమైన వస్తువు గురించి చెప్పమంటున్నావు, దాని గురించి నోటితో ఎలా చెప్పగలను, కలంతో ఎలా వ్రాయగలను. అది నోటితో చెప్పేదికాదు, కలంతో వ్రాసేది కాదు. గురువు అనుగ్రహం వలన మాత్రమే హృదయంలో ఉన్న సద్వస్తువు మనకు ఎరుకలోనికి వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-10-06, కువైట్

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏ మతంలో ఉన్నా పవిత్రత చాలా ముఖ్యం. ఎవడికైతే పవిత్రత లేదో, ఎవడి ప్రవర్తన అయితే యింపెర్సనల్‌గా లేదో వాడి మనస్సుకు అంతర్‌దృష్టి రాదు. మన హృదయంలో

ఉన్న సత్యం మనకు అనుభవంలోనికి వచ్చేవరకు నామరూపములు రెండూ మనలను బంధిస్తాయి. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అని ఆ శరీరంతోటి, పేరుతోటి తాదాత్మ్యం పొందుతున్నంత కాలం నీకు ఫ్రీడమ్ లేదు. ఈ ప్రపంచంలోనికి మనం ఎందుకు వచ్చామో అది మరిచిపోవద్దు. ఈ ప్రపంచం అనేది ఒక ట్రైనింగ్ గ్రౌండ్. దీనికే భగవాన్ చెప్పారు. ఈ ప్రపంచం అనేది ఒక అద్దం లాంటిది. అద్దం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, నీ మొఖంలో ఉన్న మచ్చలను, దుమ్మును అద్దం చూపిస్తుంది. అద్దంలో మొఖాన్ని చూసుకొని ఆ దమ్మును నీవే తీసేసుకోవాలి కాని అద్దం ఆ దుమ్మును తీయదు, దుమ్మును చూపిస్తుంది అంతే. అలాగే ఈ ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. నీలో ఉన్న బలహీనతలను అది చూపిస్తుంది. ప్రపంచం చూపించకముందు ఆ బలహీనతలు ఉన్నట్లు నీకు తెలియదు. నీలో ఆ బలహీనతలు ఉన్నాయి అని తెలిసాక నీవు ప్రయత్నం చేసి వాటిని తొలగించుకోవాలి కాని ప్రపంచం వాటిని తొలగించదు. మనం శాస్త్రంలో చదివిన విషయాలను, మహాత్ములు చెప్పిన మాటలను మన బ్రెయిన్‌లో తిప్పకోవాలి, నవ్వు ఎవరో నీవు తెలుసుకోవటానికి ఇదంతా ఉపయోగపడుతుంది. గీతలో భగవంతుడు ఏ పనులు చేయమని చెప్పాడో, ఆ పనులు చెయ్యి, ఆయన చెయ్యవద్దు అని చెప్పిన పనులు చేయకు. నీవు ఆ రకంగా జీవిస్తూ ఉంటే గమ్యాన్ని చేరుకొంటావు, భగవదనుభవం కలుగుతుంది, దుఃఖరహితస్థితిని పొందుతావు.

ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు ఎరుకలోనికి వచ్చేవరకు లేనిది ఉన్నట్లుగా నీకు కనిపిస్తూ ఉంటుంది. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలిసేవరకూ సత్యం కానిదానిని నువ్వు సత్యం అనుకొంటూ ఉంటావు. సత్పురుషల సహవాసం ఎందుకంటే సత్పురుషులతో సహవాసం వలన మనలో ఉన్న బలహీనతలు నెమ్మదిగా పల్చబడిపోతాయి అంటే వారి యొక్క వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తూ ఉంటాయి. హోలీ కంపెనీ వలన సత్యానుభవం పొందటానికి మనస్సుకు తగిన ప్రిపరేషన్ వస్తుంది, మెచ్యూరిటీ వస్తుంది. ఎవరో వచ్చి నిన్ను ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు. నీ ప్రయత్నం ఏదో నువ్వు చేసుకో, ప్రయత్నం అవసరం. గౌతమ బుద్ధుడు ఇంకో 5 నిమిషాలలో శరీరం విడిచిపెడుతున్నాడు, అప్పడు ఆయన సవితి తమ్ముడు ఏమన్నాడు అంటే బుద్ధుడులాంటి వ్యక్తి ఇంతవరకు ఈ భూమి మీదకు రాలేదు అన్నాడు. అటువంటి మాటలకు మనం అయితే సంతోషిస్తాము. మన అహంకారానికి ఫుడ్ అది. ఇది ఎప్పటికయినా దుఃఖంగా మారిపోతుంది. అహంకారాన్ని

తొలగించుకొనే శక్తి మీకు లేకపోయినా కనీసం దానికి ఆహారం అందించటం అయినా తగ్గించుకోవాలి. శరీరం అటు ఇటు తిరగటానికి ఫుడ్ అవసరమే, దానికి తగుమాత్రంగా ఫుడ్ సప్లయిచేయాలి. కాని అహంకారానికి ఫుడ్ సప్లయిచేస్తూ ఉంటే అది పెరిగిపోతుంది, దానివలన ఆరోజు కారోజు దుఃఖం పెరిగిపోతుంది. అందువలన అహంకారానికి ఫుడ్ సప్లయిచెయ్యవద్దు. దైనందిన జీవితంలో జరిగే సంఘటనలకు నీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా కూడా అహంకారానికి ఫుడ్ సప్లయి అవుతుంది అందుచేతనే పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నిందాస్థుతుల మధ్యన, లాభనష్టాల మధ్యన, హెచ్చుతగ్గుల మధ్యన ఏరోజుకారోజు నీ బ్రెయిన్‌ను బేలెన్స్ చేసుకొంటూ ఉండు అని చెప్పాడు. సవితి తమ్ముడు అన్న మాటలకు బుద్ధుడికి ఏమీ పొంగు రాలేదు. స్పిరిట్యువల్ హిస్టరీ నీవు చదివావా అని బుద్ధుడు ఆనంద్‌ను అడిగాడు. నేను చదవలేదు అని చెప్పాడు. హిస్టరీ నీవు చదవకుండా బుద్ధుడిలాంటి గ్రేట్‌మెన్ ఎవడూ రాలేదు అని ఎలా చెపుతున్నావు. ఇటువంటి మాటలు వద్దు. బుద్ధుడు గొప్పవాడు అంటే నీకు కలిసి వచ్చేదేముంది? నీవు బాగుపడే విధానం చూసుకో, నిర్వాణస్థితిని పొందటానికి ప్రయత్నించు అని చెప్పాడు. భగవంతుడు ఒక్కడే, ఇన్ని రూపాలలో కనిపించే వాడు కూడా ఆయనే. నేను మిమ్మల్ని ద్వేషిస్తున్నాను అనుకోండి అంటే నన్ను నేను ద్వేషించుకొంటున్నాను మీకు ఏదైనా అపకారం చేస్తూ ఉంటే నాకు నేనే అపకారం చేసుకొంటున్నాను. ఇది మనకు తెలిస్తే జీవితంలో బహుజాగ్రత్తగా ఉంటాము. ఎందుచేతనంటే నేను మీకు చేసిందే మరల తిరిగి నాకు వస్తుంది. ఇతరులకు నీవు ఏదైనా సహాయం చేస్తే అది తిరిగి నీకే వస్తుంది అని తెలిస్తే నువ్వు సహాయం చెయ్యకుండా ఎలా ఉండగలవు. భక్తుడికి యాక్షన్ ఉంటుంది కాని రియాక్షన్ ఉండదు. వాడు క్వయిట్‌గా ఉంటాడు, కూల్‌గా ఉంటాడు. అతని పని ఏదో అతను చేసుకొంటూ ఉంటాడు. బయట నుండి వచ్చే స్తోత్రాల ప్రభావం, విమర్శల ప్రభావం వాడి మీద ఏమీ పడదు, అది సాధన యొక్క బలం. నువ్వు నేను నేను అంటున్నావు. ఆ నేను అనే తలంపు నీకు లోపల నుండే వస్తోంది. అది ఎక్కడి నుండి వస్తోందో వెదుకు, దానిని ఉపసంహరించు. మూలతలంపు మూలంలోనే సత్యం ఉంది. నీకు ధనం ఉన్నా, గౌరవం ఉన్నా, విద్య ఉన్నా ఎన్ని ఉన్నప్పటికీ సత్యానుభవం కలిగేవరకూ నీకు ఆనందం లేదు. మూలతంపును దాని మూలంలోనికి ఉ పసంహరించి, అక్కడ ఉంచగలిగితే మూలతలంపు నశిస్తుంది, అక్కడ ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది. నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి కాని నీవు

హృదయంలోనికి వెళ్ళాలి. నీవు దేహగతమైన నేనుకే పరిమితమై ఉన్నంతకాలం నీకు ఫ్రీడమ్ లేదు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైన నేనులో నుండి విడుదల పొందాలి. నీవు దేహగతమైన నేనులోనుండి విడుదల పొందకపోతే శాంతి, ఆనందం నీ హృదయంలోనే ఉన్నా కూడా అవి నీచేతికి అందవు. ఒక వస్తువు నీటిలో పడిపోయినప్పుడు అది ఎంత లోతులలో ఉందో అంత లోతుకు నీవు మునగ గలిగితేనే ఆ వస్తువు నీచేతికి దొరుకుతుంది. అదేవిధంగా నీవు ప్రాణాన్ని బంధించి, మనస్సును నిగ్రహించి, తూకాన్ని పెంచుకొని హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళగలిగితేనే అక్కడ ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది లేకపోతే సాధ్యం కాదు. రామకృష్ణుడు ఏమని చెప్పాడు అంటే ఈ ప్రపంచంలో మంచీ ఉంటుంది, చెడ్డా ఉంటుంది. ఇసుక, పంచదార కలిపి అక్కడ పడవేస్తే అక్కడకు చీమలు వస్తాయి. అవి ఇసుకను ముట్టుకోవు, పంచదారను పట్టుకొనిపోతాయి. మనం కూడా అలాగ ఉండాలి. ప్రపంచంలో ఏదో చెడ్డ కనిపిస్తూ ఉంటే ఆ చెడ్డ ఎందుకు ఉంది అని అస్తమాను నీ మనస్సును పాడుచేసుకోవటం మానివేసి ఇసుక, పంచదార కలిపి ఉంటే చీమలు వెళ్ళి ఇసుకను వదిలేసి పంచదారను ఎలా పట్టుకొని వెళ్ళిపోతున్నాయో అలాగ నీవు మంచిని తీసుకొని చెడ్డను వదిలెయ్యి. నిన్ను నీవు తెలుసుకోవటానికి ఈ ప్రపంచాన్ని సహకారంగా తీసుకొని, నిన్ను నీవు పవిత్రం చేసుకొని, నువ్వు ఈ సృష్టిలోనికి ఎందుకు వచ్చావో ఆ పని పూర్తిచేసుకొని బయటకుపో. నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచం ఉంది, నీవు చనిపోయాక ఈ ప్రపంచం ఉంటుంది. నువ్వు పుట్టకముందు ఈ ప్రపంచాన్ని ఎవడు చూసాడో, నువ్వు చనిపోయాక కూడా వాడే చూస్తాడు, ఆగోల నీకు ఎందుకు? నీవు నిర్మలంగా ఇక్కడకు వచ్చిన పని చూసుకొని బయటకు వెళ్ళిపో. ఈ ప్రపంచం శాంతిగా ఉండాలి అని చాలామంది అంటారు. మనం లోపల అశాంతితో కాలిపోతూ ఉంటే ప్రపంచంలో శాంతి ఎక్కడ నుండి వస్తుంది. ప్రపంచం అంటే మనమే. నీ లోపల ఉన్నదే బయట కనిపిస్తుంది. నువ్వు ఏ సాధన చేసినా అక్కడ నేను ఉంటుంది. నువ్వు పూజ చేసిన, జపం చేసినా నేనుతోటి చేస్తాము. ముల్లును ముల్లుతోటి తీసేసినట్లుగా ఆ నేనును ఉపయోగించుకొని నేనులోనుండి బయట పడాలి. మతంపేరుమీద, పూజల పేరుమీద, జపాల పేరుమీద వర్క్ కల్చర్‌కు దూరం అవ్వకూడదు. మన శరీరం ఏదో రోజు చనిపోతుంది, ఏదో రోజున చనిపోతుందని చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టకూడదు. మనం చేస్తున్న పనిని జాగ్రత్తగా, శ్రద్ధగా చేస్తూ ఉంటే, అందులో నేర్పు మనం చూపించగలిగితే అది కూడా ఒక రకమైన యోగమే. మనకు కర్మఫల కాంక్ష ఎక్కువగా ఉంటుంది. మనలో ఉన్న

మైనస్ పాయింట్ ఏమిటి అంటే కోరిక ఉంటేనే ఆ ఫలితం వస్తుంది. కోరిక లేకపోతే ఏదీ రాదు అనుకొంటాము. అలా కాదు. భగవంతుడు మనకు ఏదైతే కేటాయించాడో మన కోరికతో సంబంధం లేకుండా అది వస్తుంది. భగవంతుడు ఏదైతే మనకు కేటాయించలేదో అది మనం కోరుకొన్నా రాదు. మనకు వచ్చేది ఆగదు, రానిది మనం కోరిక పెట్టుకొన్నా రాదు. ఇది మన మనస్సుకు అర్థమయితే శాంతిగా ఉంటుంది. మతాల గురించి అభిప్రాయ బేధాలు పెట్టుకోవలసిన పనిలేదు. ఉన్న వస్తువు ఒక్కటే. దానినే అనేక మతాలలో అనేక పేర్లతో పిలుస్తున్నారు. స్వర్గరాజ్యం అన్నా మోక్షం అన్నా, నిర్వాణ సుఖం అన్నా, ఇంకా వేరే పేర్లుతో పిలిచినా సత్యం అనేది ఒకటిగానే ఉంది. హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఇంపర్సనల్ బిహేవియర్ అవసరం. ప్రతీమనిషికి తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఉంటాయి. మన మాటలో, ఆలోచనలో, మన ప్రవర్తనలో సత్వగుణాన్ని కల్టివేట్ చేయటం నేర్చుకోవాలి. మూడు విషయాలు అన్ని మతాలు అంగీకరించాయి. మోడరేషన్ ఇన్ ఫుడ్, మోడరేషన్ ఇన్ స్లీప్, మోడరేషన్ ఇన్ వర్డ్. మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. దైనందిన జీవితంలో ఎంతవరకు అసరమో అంతవరకే మాట్లాడాలి, అతిగా మాట్లాడటం వలన కలహాలు పెరుగుతాయి. అతినిద్ర పనికిరాదు, నిద్రలో యుక్తంగా ఉండాలి. ఆహారనియమం అన్నింటికంటే ముఖ్యమైనది. మనకు అవసరమైన దానికంటే ఎక్కువగా తింటూ ఉంటాము. మనిషి అంటే శరీరము, మనస్సు కలిపి మనిషి అంటారు. మనం తినే ఆహారం యొక్క ప్రభావం మనస్సు మీద, శరీరం మీద ఎక్కువగా ఉంటుంది. అందువలన ఫుడ్ విషయంలో మోడరేషన్ అవసరం. ఫుడ్‌లో మోడరేట్‌గా ఉంటే సహనం పెరుగుతుంది, సత్వగుణం పెరుగుతుంది. మనం తినే ఆహారం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటామో కళ్ళతో చూసే విషయాలలో, చెవులతో వినే విషయాలలో కూడా అంత జాగ్రత్తగా ఉండాలి, అది కూడా మనకు ఫుడ్‌తో సమానము. మంచి విను, మంచిని చూడు, మంచిని మాట్లాడు. అవసరం లేని విషయాలలో కలుగజేసుకోవద్దు. ఎందులోను అతిగా ఉండవద్దు. మధ్యే మార్గం మంచిది. ఈ ఆధ్యాత్మికమార్గంలో చిత్తశుద్ధి చాలా ముఖ్యం. నాస్థికుడు కూడా న్యాయాన్ని ధర్మాన్ని అంగీకరిస్తాడు. ధర్మాన్ని ఆచరించటం ఎందుకు అంటే ఆనందం కోసమే, శాంతి కోసమే. ధర్మాన్ని ఆచరించే వాడికి, సత్యాన్ని గౌరవించేవాడికి, వాడికి ఏది అవసరమో అవి అన్నీ సమకూరతాయి అని చెపుతారు. మహాత్ములు చెప్పిన, అవతారపురుషులు చెప్పినా, ఉపనిషత్‌లలో ఋషులు చెప్పినా, ఎవరు ఏమతంలో చెప్పినా మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటానికే చెపుతున్నారు, ఇందులో రాజీలేదు. మీకు

దుఃఖం వస్తూ ఉంటే వద్దు వద్దు అంటారు. ఎందుచేతనంటే మీ స్వరూపంలో దుఃఖం లేదు. చావు వస్తూ ఉంటే మీరు ఇష్టపడరు ఎందుచేతనంటే చావులేని వస్తువు మన హృదయంలో ఉంది, అది మనమై ఉన్నాము. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఈ సృష్టి కనిపించినా కనిపించకపోయినా సత్యం ఒకటి ఉంది. అది అంతటా ఉంది. నీ హృదయంలోను ఉంది. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీవు తెలుసుకొంటే అంతటా ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి వస్తుంది. అప్పుడు నీకు ప్రయాణాలు ఆగిపోతాయి. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని భగవాన్‌ను అడిగితే ఆయన ఏమి చెప్పారు అంటే మూలతలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు అని చెప్పారు. ఆ మూలతలంపును ఉపసంహరించి దాని మూలంలోనికి పంపగలిగితే అప్పుడు మూలతలంపు నశిస్తుంది, అక్కడ ఉన్న భగవంతుడు నీకు ఎరుకలోనికి వస్తాడు. ఇప్పుడు మనందరికీ ఉండాలి అని ఉందా? చనిపోవాలి అని ఉందా? ఎవరికి చనిపోవాలి అని లేదు, అందరికీ ఉండాలనే ఉంది. ఆ ఉండటమే దేవుడు. ఇప్పుడు మన మనస్సు బ్రెయిన్‌లో ఎంత నార్మల్‌గా, నేచురల్‌గా ఉందో అంత నార్మల్‌గా, నేచురల్‌గా మనస్సు దాని మూలమైన హృదయంలో ఉండగలిగితే ఈశ్వరుడు నీకు ఎరుకలోనికి వస్తాడు. మన లోపల అజ్ఞానం ఉన్నంతకాలం సత్యాన్ని అసత్యం అనుకొంటాము. మంచిని చెడు అనుకొంటాము. ఉన్నది ఉన్నట్లుగా నీకు తెలిసే వరకూ శరీరం కూడా నీడ వచ్చినట్లు ప్రతీ మనిషినీ దుఃఖం వెంటాడుతుంది, అశాంతి వెంటాడుతుంది. ఇప్పుడు మీరు వేరు, నేను వేరు అనుకొంటున్నాము. అక్కడ నుండి ఆందోళన వస్తుంది, భయం కలుగుతుంది. మనందరము ఒక్కటే అనుకొంటాము అనుకోండి, నీకు నాకు బేధం కనిపించటం లేదు అనుకోండి ఇంక ఆందోళన లేదు, భయం లేదు. నన్ను చూసి నాకు భయం కలుగుతుందా? లేదు. మిమ్మల్ని చూస్తే నాకు భయం కలుగుతుంది. మీరు వేరు, నేను వేరు అనుకొంటూ ఉంటే అక్కడ నుండి 90 రకాల ఆలోచనలు వస్తాయి. మీరూ నేను ఒక్కటే అనుకొంటే ఏమీ లేదు. ద్వైతంలోనుండే అల్లరి అంతా వస్తోంది. భగవంతుడి కంటే మనం భిన్నంగా లేము. కాని ఆయనకు భిన్నంగా మనం ఉన్నాము అని అనుకొంటున్నాము, అదే మన అశాంతికి కారణం. మన బంధాలకు, పునర్జన్మలకు, దుఃఖానికి అంతా రూపబుద్ధి, నామబుద్ధే కారణం. ఈ రూపబుద్ధి నుండి నామబుద్ధి నుండి విడుదలపొందితే ఇంక దుఃఖంలేదు, బంధం లేదు, పునర్జన్మ లేదు, ఏమీ లేదు. మనం స్వార్థాన్ని ఒక్కసారే తగ్గించుకోలేము. కొంచెం కొంచెం తగ్గించుకొంటూ ఉంటే ఎంతో కొంత సమాజానికి ఉపయోగపడగలము. మనం భోగాలు కొంచెం తగ్గించు

కొంటే సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడతాము. మనం స్వార్థాన్ని తగ్గించుకొంటూ ఉంటే, భోగాలు తగ్గించుకొంటూ ఉంటే ఇక్కడ తృప్తిగా జీవించగలుగుతాము మరణానంతరం మోక్షం కలుగుతుంది. ఈ మధ్య అమెరికాలో ఉన్న పెద్ద ధనవంతులలో ఒకడిని ఒక రిపోర్టరు ప్రశ్న అడిగాడు. మీ ఆదాయంలో 50% మీ కుటుంబానికి ఇస్తున్నారు, 50% సమాజానికి ఉపయోగిస్తున్నారు. అంతా మీరే ఉపయోగించుకోవచ్చుకదా ఎందుకు సమాజానికి ఖర్చుపెడుతున్నారు అని అడిగాడు. ఆయన ఏమి చెప్పారు అంటే ఎవరినో ఉద్ధరించటంకోసం ఇవ్వటం కాదు, అది నాకు తృప్తిని ఇస్తోంది. భగవంతుడు నాకు ఇచ్చినది సమాజంతో షేర్ చేసుకొంటున్నాను. అది నాకు తృప్తిని ఇస్తోంది, ఆనందాన్ని ఇస్తోంది, శాంతిని ఇస్తోంది. నా శాంతికోసం, ఆనందంకోసం ఇది అంతా చేస్తున్నాను కాని దీనివలన ఏదో ఉద్ధరించ బడుతుంది అని నేను చెయ్యటంలేదు. ఏ దేవుడు అయితే ఇచ్చాడో మరల ఆయనకే ఇస్తున్నాను ఇందులో నేను అంటూ ఏమీ లేదు అని చెప్పాడు. నీ దుఃఖానికి కారణం కర్తృత్వ బుద్ధి. కర్తృత్వబుద్ధి అనేది నీ లోపలఉన్న ముడి దానిని మీ తెలివితేటల వలన తీసుకోలేరు. మీరు కొంత ప్రయత్నం చేస్తూ ఉంటే డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ వస్తుంది. అప్పుడు ఆముడి తెగిపోతుంది, అప్పుడు ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. ఒక రూపాన్ని ధ్యానం చేయటం వలన, నామాన్ని స్మరించటం వలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. మనోనిగ్రహం కోసమే విగ్రహారాధనను మన పెద్దలు ఏర్పాటుచేసారు. విగ్రహారాధన వలననే సత్యం తెలుస్తుంది అని కాదు దానివలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి. వాటివలన దేహాభిమానం తగ్గాలి. దేహాభిమానం తగ్గుతూ ఉంటే దుఃఖం తగ్గుతుంది. మనం లోకం లోనికి వచ్చాము. భగవంతుడు ఒక్కొక్కరికి ఒకో పనిని కేటాయిస్తాడు. మీ చేతిలో ఉన్న పనిని ఇష్టంగా, ప్రేమగా, భక్తితో చేయండి. ఇలా చేస్తూ ఉంటే పూజతో సంబంధం లేకుండా మీలో ఉన్న పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు. ఎక్కువగా పనిచేయటం వలన మనకు టెన్షన్ రాదు, ఫలితంకోసం ఊహించటం వలన టెన్షన్ వస్తుంది, దాని వలన బిపి పెరుగుతుంది. మనం ఎలా పని చేయాలి అంటే పరీక్షలు వ్రాసేసిన తరువాత చివరిరోజున ఆ స్టూడెంట్ ఎంత టెన్షన్ ఫ్రీగా ఉంటాడో రేపు పరీక్ష అనగా కూడా ఆ స్టూడెంట్ అంత టెన్షన్ ఫ్రీగా ఉండగలిగితే వాడు కరెక్టు స్టేట్‌లో ఉన్నట్లు గుర్తు. మనందరకు ఎంతో కొంత తెలివి ఉంది కాని భగవంతుడు మనకంటే తెలివైనవాడు, మన కంటే బుద్ధి సూక్ష్మత కలవాడు, మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు, ఆయనకు తెలియకుండా

ఈ సృష్టిలో ఏమీ జరగటం లేదు, ఇవి మీరు గుర్తుపెట్టుకొంటే మీరు టెన్షన్ లేకుండా రోజులు గడిపేస్తారు.

మీరు అందరూ మంచి మంచి ఉద్యోగాలు చేస్తూ ఉండవచ్చు, కోట్లాది రూపాయలు సంపాదిస్తూ ఉండవచ్చు, మీకు సమాజంలో గౌరవం ఉండవచ్చు. ఇవన్నీ మైనస్ పాయింట్లు కాదు, ఇవన్నీ ప్లస్ పాయింట్లే కాని నేను మిమ్మల్ని అందరిని ప్రార్థించేది ఏమిటి అంటే రోజులు అన్నీ మీకు అన్ని విధాలా అనుకూలంగా ఉన్నా ఎట్టి పరిస్థితులలోను అవినయం రాకుండా చూసుకోండి. వినయాల్ని విడిచిపెట్టవద్దు, అణకువను విడిచిపెట్టవద్దు. అణిగి ఉన్న వాడికే ఆత్మజ్ఞానం కలుగుతుంది, లోచూపు ఉన్నవాడికే ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీరు పల్లానికి వెళుతుంది కాని మెరకకు వెళ్ళదు అలాగే విజ్ఞానం, ఎవడికైతే వినయం ఉందో వాడినే వరిస్తుంది కాని అవినయం ఉన్నవాడిని వరించదు. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నా నామాన్ని ఎవరైతే స్మరించుకొంటున్నారో, నేను చెయ్యమన్న పనిని మానకుండా ఎవరైతే చేస్తున్నారో, నేను వద్దని చెప్పిన పనిని ఎవరైతే మానివేస్తున్నారో, నా పాదాలను ఎవరైతే ఆశ్రయిస్తున్నారో వారి యోగ క్షేమాలను నేను చూస్తాను అని పరమాత్మ చెప్పాడు. యోగం అంటే ఉన్నది కాపాడటం, క్షేమం అంటే లేనిది ఇవ్వటం. మీకు బుద్ధి సూక్ష్మత ఉంది అనుకోండి. అది ఈశ్వరుడు ఇస్తే మనకు వచ్చింది, ఈశ్వరుడు ఇవ్వకుండా ఏదీ మనకు రాదు. కొంతమందిలో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి, కొంతమందికి శక్తి ఎక్కువగా ఉంటుంది, కొంతమంది బాగా ఆరోగ్యంగా ఉంటారు, కొంతమంది ఎక్కువగా సమాజానికి ఉపయోగపడుతూ ఉంటారు. అక్కడ ఏదో భగవంతుడి యొక్క వైభవం ఉంది, అది భగవంతుడి ప్రసాదం. మీలో ఏదైనా శక్తి ఉంటే, మీకు బుద్ధిసూక్ష్మత ఉంటే, మీకు ధనం ఉంటే ఇది అంతా నా సొంతం కాదు, దేవుడు ఇస్తే నాకు వచ్చింది అని భావన చేసుకొని మీరు ఎంత వినయంగా ఉంటే అంత భౌతికంగా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-11-06, తణుకు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బి ప్రో యాక్టివ్, బి పాజిటివ్, బాడీ లాంగ్వేజ్ ఈ మాటలు భౌతికానికి ఉపయోగ పడతాయి. ఆధ్యాత్మికానికి ఉపయోగపడతాయి. చనిపోయిన తరువాత ఉత్తమ లోకాలకు వెళ్ళటానికి ఉపయోగపడతాయి. జీవించి ఉండగా సుఖంగా ఎలా జీవించాలో తెలుస్తుంది. ఇవి లౌకిక మాటల కింద అనిపించినా అన్ని మతాల సారం. కొంతమంది లోపల బాగా